కాలనీ, బస్తీల్లో సీసీ కెమెరాలు
ఏర్పాటు చేసుకోవాలి


ఆస్‌బెస్టాస్ కాలనీలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఎస్సై సత్యం

ఆల్విన్‌కాలనీ: సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆస్‌బెస్టాస్ కాలనీవాసులు ముందుకు రావటం అభినందనీయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీలో 15 లక్షల రూపాయల వ్యయంతో అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 104 సీసీ కెమెరాలను ఎస్సై సత్యం, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాలను ప్రతి బస్తీ, కాలనీలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. శాంతి భద్రతలు కాపాడటానికి పోలీస్ అధికారులు ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అన్నారు. సీసీ కెమెరాలతో కేసుల పరిష్కారం సులువు అవుతుందన్నారు. నేర శోధన, నివారణకు కెమెరాలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు.

◆ అదే విధంగా కాలనీల్లో ప్లాస్టిక్ నిషేధించాలని.. బెస్ట్‌కాలనీ అవార్డు వచ్చేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఆస్‌బెస్టాస్‌కాలనీకి అన్ని రకాల వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీల్లో ఆహ్లాదకరమైన ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కాలనీ సంక్షేమం, అభివృద్ధే ముఖ్య ఉద్దేశంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనారాయణ, నాగేశ్వర రావు, అబ్దుల్ ఖయ్యూమ్, కృష్ణ, రఫీక్, హరిప్రసాద్, భగత్‌సింగ్, సదాశివుడు, పోశెట్టిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం


ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ తదితరులు

మోతీనగర్: కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్‌లోని ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు సహకరిస్తున్నారా లేదా అని అక్కడకి వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు సహకరించకపోతే తనకు నేరుగా ఫోన్ చేయాలని బండి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకుల రమేష్, కొప్పిశెట్టి దినేష్‌కుమార్, సతీష్ రెడ్డి, విఠల్ రెడ్డి, నరసింహ యాదవ్, సాంబశివరావు, నాగరాజ్, శ్రీధర్, అసద్, ప్రవీణ, అజయ్, తోచర్, నేతలు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నోడల్ అధికారి కిషన్, నాయకులు

కూకట్‌పల్లి: రాష్ట్ర ప్రోగెస్సివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ కూకట్‌పల్లి మండల శాఖ నూతన సంవత్సరం 2024 కేలండర్‌ను మండల నోడల్ అధికారి కిషన్ చేతుల మీదుగా ఆర్‌పి కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కిషన్ మాట్లాడుతూ.. పీఆర్‌టీయూ సంఘం ఉపాధ్యాయుల కోసం, విద్యారంగ సంరక్షణ కోసం ఎంతో కృషి చేస్తోందన్నారు. మండలశాఖ ప్రధాన కార్యదర్శి పర్మగళ్ల నర్సిములు మాట్లాడుతూ.. పీఆర్‌టీయూ సంఘం ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగం అభివృద్ధికై ఏర్పడి రాష్ట్రంలోనే పెద్ద సంఘంగా అవతరించి ఉపాధ్యాయుల సమస్యల సాధనలో ముందుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు విఠల్, రమేష్, చంద్ర, మండల అసోసియేషన్ అధ్యక్షులు హరీష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట్ డివిజన్ సమస్యలు పరిష్కరించాలి


మేయర్ గద్వాల విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్ రాస్‌లను గురువారం మూసాపేట కార్పొరేటర్ మహేందర్ కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని మైసమ్మ చెరువు నాలా, మైసమ్మ చెరువు నుంచి భరత్‌నగర్ మార్కెట్ వరకు ఎస్ఎన్‌డీపీ క్రింద నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. పనులు చేపడితే వడ్డెర బస్తీ, గోడౌన్స్ శక్తినగర్, భరత్‌నగర్ వాసులకు ముంపు నుంచి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. దీనిపై మేయర్, కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ స్టాండింగ్ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటిన ఆర్టీసీ ఉద్యోగులు


పతకాలు సాధించిన ఆర్టీసీ ఉద్యోగులను అభినందిస్తున్న డీఎం మహమ్మద్ ఇషాక్

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోకు చెందిన పలువురు అథ్లెట్స్‌ను గురువారం కూకట్‌పల్లి డీఎం మహమ్మద్ ఇషాక్ అభినందించారు. డిపోలో కండక్టర్లుగా పనిచేస్తున్న టి. మంజుల, ఏ. శ్రీదేవి, సెక్యూరిటీ సోమేశ్వరరావులు ఇటీవల నగరంలో జరిగిన తెలంగాణ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటారు. ఈ పోటీల్లో కూకట్‌పల్లి డిపోలో సెక్యూరిటీగా పనిచేస్తున్న సోమేశ్వరరావు 400 మీటర్లలో గోల్డ్‌మెడల్, ట్రిపుల్ జంప్‌లో గోల్డ్ మెడల్, లాంగ్ జంప్‌లో రజతం సాధించారు. కండక్టర్ మంజుల 3 గోల్డ్ మెడల్స్, ఏ. శ్రీదేవి 2 గోల్డ్ మెడల్స్‌ను ఒక రజత పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ వారిని అభినందిస్తూ ఉద్యోగం చేస్తూనే క్రీడలపై ఆసక్తితో పోటీలో పాల్గొని మెడల్స్ సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

నాగదేవతకు ప్రత్యేక పూజలు


నాగదేవత ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నూతన కమిటీ సభ్యులు

కూకట్‌పల్లి: చైతన్యనగర్‌లోని శ్రీనాగదేవత అమ్మవారి ఆలయం నూతన కమిటీ సభ్యులు గురువారం ఆలయంలోని నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సభ్యులను ఆలయ అర్చకులు నటరాజ శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు. చైర్మన్‌గా వి.నర్సయ్య, వైస్ చైర్మన్‌గా కృష్ణంరాజు, ఎన్.యాదగిరి, జనరల్ సెక్రటరీ సీహెచ్. బాలరాజు, జాయింట్ సెక్రటరీ ఏ.నర్సింహాచారి, ట్రెజరర్లు డి.ఉమాపతి, హెచ్. సత్యనారాయణలు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అభినందించారు.

సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి

- ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి
- రాంగ్‌రూట్, అతివేగంతో ప్రాణాలు కోల్పోవద్దు
- పదేపదే పట్టుబడితే కఠిన చర్యలు
- మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య




మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కౌన్సిలింగ్ సెంటర్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మాదాపూర్: వాహనాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని మాదాపూర్ ట్రాఫిక్ సీఐ జి.నర్సయ్య సూచించారు. రాంగ్‌రూట్, అతివేగంతో ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజలు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. అవగాహన కార్యక్రమాల వల్ల కొంతమేర మార్పు ఉంటుంది. ఎవరికి వారే నిబంధనలు పాటిస్తే సమస్య రాదు. అవసరమైనప్పుడే కార్లను వాడాలి. ఆఫీసులకు వెళ్ళేవారు ఒక గంట ముందు బయలుదేరాలని మాదాపూర్ ట్రాఫిక్ సీఐ జి.నర్సయ్య అంటున్నారు.

ప్ర : మాదాపూర్‌లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలు ?

జ: సోమవారం నుంచి శుక్రవారం వరకు ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. వ్యక్తిగత వాహనాలు బాగా పెరుగుతున్నాయి. వీఐపీ జోన్ కావడం .. ఐకియా నుంచి జేఎన్‌టీయు వరకు సర్వీస్ రోడ్డు లేకపోవడంతో సమస్య జఠిలంగా మారింది. హైటెక్స్, మైండ్‌స్పేస్, దుర్గం చెరువు, ఇనార్బిట్‌మాల్, టెక్ మహేంద్ర, సైబర్‌టవర్స్ వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉంది. నో పార్కింగ్, రాంగ్‌రూట్, హెల్మెట్ లేకపోవడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్ కేసులు ఎక్కువగా ఉన్నాయి.

ప్ర : మాదాపూర్ వీఐపీ జోన్ కావడంతో నెలకొంటున్న ప్రధాన సమస్యలు ఏమిటి?

జ: మాదాపూర్‌లోని హైటెక్స్, శిల్పకళా వేదిక, శిల్పారామం, హెచ్ఐసీసీలో ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు పెద్ద సంఖ్యలో సదస్సులు జరుగుతాయి. జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలకు వీఐపీలు ఎక్కువగా వస్తుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. సదస్సుల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కష్టంగా ఉంటుంది.

ప్ర : డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి ఎలాంటి అవగాహన కల్పిస్తారు?

జ: స్వతహాగా ఎవరికి వారే మారాలి తప్ప అవగాహన కార్యక్రమాల వల్ల పెద్ద మార్పురాదు. డ్రంకన్ డ్రైవ్‌లో దొరికిన వారిని మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన కౌన్సిలింగ్ సెంటర్‌లో అవగాహన కల్పిస్తారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్ల జరుగుతున్న ప్రమాదాలు, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు పడుతున్న ఇబ్బందులపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కొందరు మాత్రం పదేపదే పట్టుబడుతున్నారు.

ప్ర : వాహనదారులకు, పాదచారులకు మీరు ఇచ్చే సూచనలు ఏంటి?

జ: ట్రాఫిక్ రూల్స్‌ను ఖచ్చితంగా పాటించాలి. వాహనదారులు కార్యాలయాలకు వెళ్ళేవారు ముందుగానే బయలుదేరాలి. హడావిడిగా బయలుదేరి రాంగ్‌రూట్‌లో ప్రయాణించవద్దు. మిగతా వాహనదారులకు సమస్యగా మారుతుంది.ఒక్కోసారి ప్రాణాలు కోల్పోతారు. పాదచారులు ఫుట్‌పాత్‌లపై నడవాలి.సిగ్నల్స్ ప్రకారమే రోడ్డు దాటాలి. ఇక వాహనాలకు నంబర్‌ప్లేట్‌లు తప్పనిసరిగా ఉండాలి. ఫ్యాషనబుల్‌గా ఉండకూడదు.

దరఖాస్తులను అందుబాటులో ఉంచాలి

కార్పొరేటర్ రవీందర్ రెడ్డి

బాలానగర్: ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని బాలాగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం బాలానగర్ డివిజన్ పరిధిలో దిల్‌కుష్‌నగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

అన్నదానం

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీ సాయిబాబా మందిరంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అన్నదాతలైన లక్ష్మి, శ్రీదేవి భక్తులను సురభి రమేష్‌రావు సన్మానించారు.

కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా చామకూరి వెంకన్న



భాగ్యనగర్‌కాలనీ: కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా చామకూరి వెంకన్న బదిలీపై వచ్చారు. ఆయన సైబరాబాద్ క్రైమ్ విభాగంగా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ భార్యాభర్తల వివాదం కేసులో జోక్యం చేసుకొని భర్తను చితకబాదిన విషయంలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి విచారణ చేపట్టి సస్పెండ్ చేశారు.

కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌గా కృష్ణమోహన్



మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కృష్ణ మోహన్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఇన్‌స్పెక్టర్ సురేందర్‌గౌడ్ సీసీఎస్ మేడ్చల్‌కు బదిలీపై వెళ్లారు. శుక్రవారం ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళలకు కుట్టు మెషిన్లను అందించాలి


మహిళలతో కలిసి ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లో కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొంది పూర్తి చేసిన వారికి కుట్టు మెషిన్లను అందించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలసి నాయకులు విన్నవించారు. గురువారం స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు గడ్డం నర్సింగ్‌రావు కుట్టు శిక్షణ కేంద్రం నిర్వాహకులు ఎం.పద్మలత, సుమలత, సుప్రియ ఎమ్మెల్యేను కలసి వివరాలను వెల్లడించారు. ఖార్డ్ సంస్థ ఆధ్వర్యంలో రెండో, మూడో విడతలో శిక్షణ పొందిన 150 మంది మహిళలకు కూడా కుట్టు మెషిన్లను అందించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తెలిపారు.

యోగా గ్రూప్ సభ్యులకు రుణపడి ఉంటా


ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి అభినందనలు తెలుపుతున్న వినాయక పార్కు యోగా గ్రూప్ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌కాలనీలోని వినాయక పార్కు యోగ గ్రూప్ సభ్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి గురువారం ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆరెకపూడి గాంధీకి అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... వినాయక పార్కు యోగా గ్రూప్ సభ్యులకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. తనపై చూపిన ఆదరాభిమానులకు ధన్యుడినని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, యోగా గ్రూప్ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, రేణుక, విజయలక్ష్మి, టీఎల్.రాణి, మాధవి, రాధారాణి, హేమ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొట్టిన ఘటనలో మహిళ మృతి

భాగ్యనగర్‌కాలనీ: ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన సంఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జగద్గిరిగుట్ట రంగారెడ్డినగర్‌కు చెందిన ఆడెపు శైలజ (34) నెక్సస్ ఫోరంమాల్ సమీపంలో ఓ సంస్థలో పనిచేస్తుంది. ఈ క్రమంలో గురువారం ఉదయం తన ఇంటి నుంచి (టీఎస్ 08జేఎస్ 1770) ద్విచక్ర వాహనంపై ఆఫీస్‌కు వెళ్లే క్రమంలో కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ కిందకి రాగానే వెనక నుంచి బస్సు ఢీ కొట్టింది. దీంతో శైలజ తన ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడిపోయింది. వెంటనే (ఏపీ11 జెడ్ 6654) ఆర్టీసీ బస్సు టైరు ఆమెపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స కోసం ఆమెను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

భాగ్యనగర్‌కాలనీ: కిరాణాషాపుకు వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ అంతెరగాన్‌కు చెందిన భూతాలి బాలరాజు (41) కుటుంబంతో కలిసి సీబీసీఐడీ కాలనీలోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీన షాప్‌కి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి వస్తుండగా హైదర్‌నగర్ పోచమ్మ దేవాలయం సమీపంలో మియాపూర్ వైపు నుంచి వచ్చిన బైక్ రైడర్ రోడ్డు దాటుతున్న బాలరాజును ఢీకొట్టాడు.

ఈ ఘటనలో బాలరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలరాజు భార్య మాధవి చికిత్స కోసం సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించాలని సూచించారు. అక్కడి డాక్టర్లు గాయాలపాలైన బాలరాజును పరిశీలించి కుడికాలు విరగడంతో పాటు తల వెనుక భాగంలో రక్తం గడ్డకట్టి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మూసాపేట: మూసాపేట ఆంజనేయనగర్‌లోని శ్రీసీతారామ కల్యాణ మండపం వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రేమ్‌సాగర్ తెలిపిన వివరాల ప్రకారం... స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

భాగ్యనగర్‌కాలనీ: అప్పులు, కుటుంబ సమస్యలు తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు జిల్లాకు చెందిన ఏడుపుగంటి చిన్న సాంబశివరావు (55)ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ భార్యతో కేపీహెచ్‌బీ కాలనీ హెచ్ఐజీ-20లో నివాసం ఉంటున్నారు. వీరి కుమార్తె కలకత్తాలో నివసిస్తుండటంతో కొద్ది రోజుల క్రితం సాంబశివరావు తన భార్యతలో కలిసి కలకత్తాకు వెళ్లాడు.

◆ సాంబశివరావు ఒక్కడే అక్కడి నుంచి తిరిగి గత పది రోజుల క్రితం కేపీహెచ్‌బీ కాలనీకి వచ్చాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సాంబశివరావు ఇంటి ఇనుప హుక్కుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసుల ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటనా స్థలంలో సూసైడ్ నోట్ లభించినట్లు పోలీసులు పేర్కొన్నారు. కుటుంబ కలహాలతో పాటు అప్పుల బాధలు తట్టుకోలేక తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని సూసైడ్ నోటు రాసినట్లు పోలీసులు పేర్కొన్నారు. సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకొని మృతుడి వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

సీఆర్ ఫౌండేషన్‌లో నైపుణ్య శిక్షణ కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, ట్యాలీ, డీటీపీ శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. మహిళలు మొదట అడిష్మన్ కొరకు రూ.150లు చెల్లించాలి. మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాలవారు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు కన్వీనర్ వనశ్రీ ఫోన్ : 9246530048కు సంప్రదించగలరు.

ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్

సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఉంది. మహిళల, కుటుంబ సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ కూడా తీసుకోవచ్చు.

కెనరీ ద స్కూల్ వార్షికోత్సవం

మాదాపూర్: చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో బుధవారం రాత్రి కెనరీ ది స్కూల్ 8వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆదిలక్ష్మి చింతలపాటి హాజరై ప్రసంగించారు. చిన్నారులకు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. విద్యార్థులు సహజవనరుల పరిరక్షణపై నాటకం వేశారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ అరవింద్‌రెడ్డి, చైర్‌పర్సన్ శ్వేతారెడ్డి చప్పిడి, ప్రిన్సిపల్ లిడియా క్రిస్టీనా, అడ్మిన్ మేనేజర్ మహేశ్ అక్కం, పాల్గొన్నారు.

గీతంలో అంతర్జాతీయ సదస్సు

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో 'పర్యావరణ, సమాజం, పరిపాలనలో (ఈఎస్‌జీ) సమకాలీన సనుస్యలు' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును 2024 ఫిబ్రవరి 16,17 తేదీలలో నిర్వహించనున్నట్టు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.ఈఎస్‌జీ ప్రాముఖ్యత, పర్యావరణం, సమాజం, ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం గురించి అవగాహన పెంచడం ఈ సదస్సు లక్ష్యంగా పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలు, నిబంధనలు, కార్పొరేట్ పద్ధతులు, పెట్టుబడి వ్యూహాలు, వాటాదారులకు అనుగుణంగా ఈఎస్‌జీ కి సంబంధించిన అనేక విస్తృత అంశాలను ఈ సదస్సులో చర్చిస్తారని చెప్పారు. ఈ సదస్సులో పాల్గొనేవారు విస్తృత చర్చలలో పాల్గొనడంతో పాటు పరిశోధనా పత్రాలను కూడా సమర్పించవచ్చని, పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసిన పరిశోధక పత్రాలను 2024 జనవరి 20వ తేదీలోగా సమర్పించాలని స్పష్టీక రించారు. ఈ సదస్సులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు 2024 జనవరి 31లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం డాక్టర్ జీ.ఆర్.కే.ప్రసాద్‌ను 95429 78515లో సంప్రదించాలని సూచించారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

హఫీజ్‌పేట్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆరంభ టౌన్‌షిప్, హఫీజ్‌పేట్ కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం మహిళలకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ హాజరై మాట్లాడుతూ ఆరోగ్యం, పారిశుద్ధ్యం, విజ్ఞానాన్ని మేళవించే సనాతన సాంప్రదాయమే ముగ్గులు వేయడమన్నారు. పట్టణీకరణ నేపథ్యంలో అపార్ట్‌మెంట్ కల్చర్ బాగా పెరిగిన తరువాత మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు భవిష్యత్తు తరానికి అందించడానికి, మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తాటిచర్ల వరలక్ష్మి, అసోసియేషన్ సభ్యులు, ఆషా, విజయలక్ష్మి, దుర్గ, నాగలక్ష్మి, సంతోషి, సుశీల పాల్గొన్నారు.

ఎస్‌పీఐఈ ఫెలోగా ప్రొ.సోమవేణుగోపాలరావు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సోమ వేణుగోపాలరావు సొసైటీ ఆఫ్ ఫొటోగ్రాఫిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్స్ (ఎస్‌పీఐఈ) ఫెలోగా ఎన్నికయ్యారు.ఈయన హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ ప్రొఫెసర్. ఎస్‌పీఐఈ అనేది ఆప్టిక్స్, ఫొటోనిక్స్ టెక్నాలజీ అంతర్జాతీయ ప్రొఫెషనల్ సొసైటీగా గుర్తింపు పొందింది. 184 దేశాల నుంచి రెండున్నర లక్షలకుపైగా నిపుణులతో కూడిన గ్లోబల్ సంస్థగా పనిచేస్తోంది. కాగా ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని 'న్యూ బిగినింగ్' పేరిట ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మెడిటేషన్, స్ఫూర్తిదాయక చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నూతన సంవత్సర సంబరాలు చేసుకుంటారు. వివరాలకు ఫోన్ నెంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఇనార్బిట్‌లో నేటి నుంచి 'బ్రాండ్' షో

సాక్షి సిటీబ్యూరో: మాదాపూర్‌లోని ఇనార్బిట్‌మాల్‌లో దేశంలోనే పేరొందిన ఫ్యాషన్ బ్రాండ్స్ ఉత్పత్తుల ప్రదర్శన శుక్రవారం నుంచి 3 రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని మాల్ ప్రతినిధులు తెలిపారు. జాక్ అండ్ జోన్స్, శంతను నిఖిల్, లెవిస్...తదితర 100కుపైగా విభిన్న రకాల బ్రాండెడ్ ఉత్పత్తులు ఈ ప్రదర్శనలో కొలువుదీరుతున్నాయని, వీటిని అనూహ్యమైన ఆఫర్లతో అందిస్తున్నామని వివరించారు.

బాల కార్మికుడికి విముక్తి

గచ్చిబౌలి: వెల్డింగ్ షాపులో పని చేస్తున్న బాల కార్మికునికి ఆపరేషన్ స్మైల్ టీం విముక్తి కల్పించింది. గోపన్‌పల్లిలోని హెచ్‌కెజీఎస్ వెల్డింగ్ షాపులో గత నెల రోజులుగా ఒరిస్సాకు చెందిన బాల కార్మికుడు హమీద్ అలీ(14) పని చేస్తున్నాడు. సమాచారం అందడంతో గురువారం ఎన్‌టీఆర్‌నగర్‌లోని వెల్డింగ్ షాపునకు డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ సరస్వతి ఆధ్వర్యంలో వెళ్లి హమీద్ అలీ(14)ని తీసుకొని హోమ్‌కు తరలించారు. షాపు యజమాని మహ్మద్ అమ్జద్‌పై గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ విఠల్, హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ కుమార్, కానిస్టేబుళ్లు సంతోష్ కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసైన వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసైన వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఏఎస్ఐ సురేందర్ రెడ్డి కథనం ప్రకారం... పటాన్‌చెరు పట్టణంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన జోగు శీను(46) టెంట్ హౌస్‌లో పనిచేసేవాడు., గత కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి జోగు శీను పడుకున్న చోట నుండి లేవకపోవడంతో అతని సోదరుడు యాదయ్య చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెల్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.మృతుడి సోదరుడు యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో..

అనారోగ్యంతో వాంతులు చేసుకుని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది ఏఎస్ఐ సురేందర్ రెడ్డి కథనం ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సాజిత్ బిశ్వాస్(40) బతుకుదెరువు కోసం నెల క్రితం ఇస్నాపూర్ వచ్చి సోదరుడి వద్ద ఉంటూ పాశమైలారం పారిశ్రామికవాడలో ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రెండవ తేదీ డ్యూటీకి వెళ్లి వచ్చిన తర్వాత రాత్రి 10 గంటలకు ఇంట్లో వాంతులు చేసుకున్నాడు. తిరిగి మరుసటి రోజు మూడో తేదీ వాంతులు కావడంతో సోదరుడు చికిత్స కోసం ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుండి పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి సోదరుడు అబిత్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.